క్లుప్తంగా

ఘనంగా పైడితల్లమ్మ మెరుపుల మహోత్సవం



భక్తులకు దర్శనమిచ్చిన పైడితల్లమ్మ అమ్మవారు

రాంబిల్లి : మండలంలో ప్రసిద్ధి చెందిన పైడితల్లమ్మ అమ్మవారి మెరుపుల మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి భక్తులు ఉపవాసాలు ఆచరించి జాగరణ చేసారు. గురువారం భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మామిడివాడ, నారాయణపురం, కొత్తూరు, చినకలవలాపల్లి తదితర గ్రామాల ప్రజలు ఈ పండగను జరుపుకొన్నారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

మోస్తరు వర్షం... ఎండల నుంచి ఉపశమనం



వర్షంతో రోడ్డుపై నీరు

ఎస్.రాయవరం : మండలంలో గురువారం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కురిసిన వర్షంతో మండలం ఒక్కసారిగా చల్లబడింది. కొన్ని రోజులు ఎండ తీవ్రతతో ఉక్కిరి బిక్కిరి అయిన మండల వాసులకు ఉపశమనం కలిగించింది. మండు వేసవిలో కురిసిన ఈ వర్షాలు వాతవరణం చల్లబడడంతో పాటు అన్ని పంటలకు ఊపిరి పీల్చుకునేలా చేశాయని చెబుతున్నారు. అయితే ఈ వర్షంతో లోతట్టు ప్రాంతల్లో నీరు చేరి చెరువుల్లా దర్శన మిచ్చాయి. ఏ మాత్రం వర్షం కురిసినా అడ్డురోడ్డు బిగ్‌బజార్ సమీపంలోనూ, పి.ధర్మవరం బస్‌షెల్టర్ వద్ద, సైతారుపేట మలుపులోనే రోడ్డుపై నీరు నిలిచి పోయి చెరువుల్లా దర్శన మిస్తున్నాయి.

గ్రంథాలయంలో విద్యార్థుల పుస్తక పఠనం



పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

అచ్యుతాపురం: అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో గురువారం పుస్తక పఠనం నిర్వహించారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులు పుస్తకాలను చదివించే విధంగా ప్రోత్సహిస్తున్నట్టు గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు తెలిపారు. పది మంది విద్యార్థులు పోటీ పరీక్షలు, జనరల్ నాలెడ్జ్, వర్తమాన అంశాలకు సంబంధించిన పుస్తకాలను చదివారు.

ఘనంగా కొత్త మహలక్ష్మి అమ్మవారి పండగ

మునగపాక : మండల కేంద్రంలో గురువారం కొత్తమహలక్ష్మి అమ్మవారి పండగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

స్థిరంగా కూరగాయల ధరలు

కశింకోట: స్థానిక వారపు సంతలో గురువారం కూరగాయల ధరలు దాదాపు స్థిరంగా ఉన్నాయి. కిలో ఉల్లిపాయలు రూ.25, టమాటా, బంగాళాదుంప రూ.30, బెండకాయ, వంకాయ రూ.40, క్యారెట్, బీట్రూట్, కాకరకాయ రూ.60, బీరకాయ రూ.80కి విక్రయాలు సాగాయి.

23న త్రిపురాంతక స్వామి కల్యాణం

కశింకోట: స్థానికంగా వెలసిన పురాతన సర్వ మంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి ఆలయం(శివాలయం)లో ఈ నెల 23న స్వామి వారి 108వ కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు వి.బాల్జీ, వి.కృష్ణ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలకు శాస్త్రోక్తంగా వేద పండితుల మంత్రోశ్చరణల మధ్య కల్యాణం జరగనుందన్నారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

డెంగ్యూ నివారణపై అవగాహన



డెంగ్యూ వ్యాధి పై అవగాహన ర్యాలీ నిర్వహించిన వైద్య సిబ్బంది



డెంగ్యూ వ్యాధిపై అవగాహన ర్యాలీ చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది



హరిపాలెంలో డెంగ్యూ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



దిమిలిలో వైద్య సిబ్బంది ర్యాలీ

పాయకరావుపేట : జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా మండలంలో శ్రీరాంపురం పీహెచ్‌సీ పరిధిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.కావ్య, వై.తులసీ నవీన ఆధ్వర్యంలో డెంగ్యూ వ్యాధి పట్ల అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ వ్యాధి సోకకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. డెంగ్యూ వ్యాధి సోకినచో తీసుకోవలసిన జాగ్రత్తలపై వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో ఆర్.జె.బాలాజీసింగ్, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : దోమలు వ్యాప్తి చెందకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్త పడాలని సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారి వాసంతి అన్నారు. జాతీయ డెంగ్యూ దినోత్సవం పురస్కరించుకుని గ్రామంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమకాటు వల్ల వచ్చే వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. డెంగ్యూ జ్వరం వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంచుకోవాలన్నారు. డెంగ్యూ వ్యాధిపై ప్రారంభంలో అప్రమత్తం కాకపోతే ప్రాణాంతకం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని హరిపాలెంలో గురువారం జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా వైద్యాధికారి వసంతకుమార్ మాట్లాడుతూ దోమలు నిల్వ ఉండాకుండా చేసుకోవాలని సూచించారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. దోమ కాటుకు గురికాకుండా జాగ్రత పడాలని సూచించారు. ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాస్, సూపర్‌వైజర్ ఉమా మహేశ్, సునీత, శాంతి, గణేశ్, నాగేశ్వరరావు, వరలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రాంబిల్లి: డెంగ్యూ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా వుండాలని దిమిలి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బాల శ్రావణి అన్నారు. డెంగ్యూ దినోత్సవం సందర్భంగా గురువారం దిమిలిలో డెంగ్యూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తీవ్రమైన జ్వరం, తలనొప్పి, శరీరం పై దద్దుర్లు, వాంతులు, వికారం, రక్త విరోచనాలు , వెన్ను నొప్పి వంటి లక్షణాలుంటే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి వైద్య సాయం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో ఎస్ఎస్‌వీఎస్ రాజు, హెల్త్ సూపర్‌వైజర్ సీహెచ్ ధనరాజు పాల్గొన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుడుతున్న అర్చకులు



శ్రీవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

పెందుర్తి : వెంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. విశ్వక్షేణ ఆరాధన, పుణ్యాహవచనం, అంకురార్పణ, ఋత్సంగ్రహణం, యాగాశాల అర్చన, అగ్ని ప్రతిష్ట జరిగాయి. వెంకన్నకు ప్రత్యేక పూజలు చేశారు. ఐదు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం ఉదయం ధ్వజారోహణ, హోమాలు చేస్తారు. సాయంత్రం లక్ష తులసి, మల్లికా పుష్పాలతో స్వామివారికి విశేష అర్చనలు జరుగుతాయి. మూడో రోజు శనివారం వైశాఖ శుద్ధ దశమి సందర్భంగా సాయంత్రం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. నాలుగో రోజు ఆదివారం సాయంత్రం తిరువీధి ఉత్సవంలో భాగంగా స్వామివారి రథోత్సవం జరగనుంది. వెంకటాద్రి నుంచి పెందుర్తి పురవీధుల్లో స్వామివారు రథంపై పయనిస్తూ చినముషిడివాడ సప్తగిరినగర్‌లోని అలివేలు మంగమ్మ సన్నిధి వరకు సాగుతూ భక్తులకు ఆశీస్సులు అందిస్తారు. ఆఖరి రోజు సోమవారం ఉదయం స్వామి వారికి చక్రస్నానం, చక్రత్తాళ్వారులతో కలిసి దివ్య స్నానమాచరిస్తారు. సాయంత్రం పుష్పయాగం, మహా పూర్ణాహుతి, ద్వాదశారాధన, స్వామివారికి విశేష అర్చనలు, ఊంజల్ సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ప్రతినిధులు వెల్లడించారు. తొలిరోజు పూజల్లో ఈవో నీలిమ, ఆలయ ప్రధాన అర్చకుడు రామానుజాచార్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

19న లక్ష తులసీ పూజ



పూజలకు సిద్ధమైన వేంకటేశ్వర దేవాలయం

రోలుగుంట: స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఈ నెల 19న లక్ష తులసీ పూజా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త దివంగత ముత్యాల రామస్వామి కుమారులు తెలిపారు. ఆలయం వద్ద ఆదివారం ఉదయం 6 గంటలకు స్వామివారి పురాతన శిలావిగ్రహానికి పంచామృతాభిషేకం, నీరాజనం, 8 గంటల నుంచి లక్ష తులసీ పూజ భక్తుల బృందాలతో నిర్వహిస్తామన్నారు. వంద మంది భక్తులతో సహస్రనామార్చన చేస్తామన్నారు. 20 మంది ఒక బృందంగా ఈ పూజలు నిర్వహిస్తామని అర్చకుడు రేజేటి శ్రీనివాసాచార్యులు తెలిపారు.

ఘనంగా కొౌమరవోలు తల్లి పండగ



అమ్మవారిని దర్శించుకోవడానికి వేచి ఉన్న భక్తులు

రోలుగుంట: కొౌమరవోలులో గ్రామదేవత పండగను గ్రామస్తులు గురువారం ఘనంగా నిర్వహించారు. మూడేళ్లకొకసారి నిర్వహించే పండగకు ఇతర జిల్లాలు, రాష్ట్రాల్లో ఉద్యోగ, వ్యాపార రంగాల్లో స్థిరపడిన గ్రామస్తులు స్వగ్రామానికి తరలి వచ్చారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అమ్మవారి ఆలయం వద్ద గ్రామ వీధుల్లో విద్యుద్దీపాలంకరణతో ముస్తాబు చేశారు. వేకువ జాము నుంచి సాయంత్రం వరకు భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచ్ గొర్లె రమణమ్మ, ఉప సర్పంచ్ బోశం వెంటకలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొర్లె వెంకటరామన్, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయం వద్ద బాణసంచా కాల్చారు. అదేరోజు రాత్రి గ్రామ వీధుల్లో ఏర్పాటు చేసిన స్టేజ్‌లపై ఆర్కెస్ట్రా, సినీ డూప్ ఆర్టిస్టుల డ్యాన్స్, బుర్రకథ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయం వద్ద ఉత్సవ కమిటీ చైర్మన్ గొర్లె చెల్లంనాయుడు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

సొంత గూడులో పశువైద్య శాల

నరసింగబిల్లి పశువైద్యశాల.. సొంత భవనం కోసం దశాబ్దంన్నరకు పైగా నిరీక్షించాల్సి వచ్చింది. అప్పటి పాలకులు అరకొర నిధులిచ్చి చేతులు దులిపేసుకున్నారు. దీంతో అసంపూర్తిగా మిగిలిన భవనం గురించి పట్టించుకున్న నాథుడే లేడు. పరిసర ప్రాంతాల పాడిరైతుల కష్టాలు తెలుసుకున్న ప్రస్తుత ప్రభుత్వం నిధులు కేటాయించడంతో పనులు పూర్తి చేసుకుని, పశువైద్య సేవలు అందిస్తోంది.



నరసింగబిల్లి పశువుల ఆస్పత్రి నూతన భవనం

- నరసింగబిల్లి పశువైద్య శాలకు తీరిన అద్దె ఇక్కట్లు
- అందుబాటులో మెరుగైన పశువైద్య సేవలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న పరిసర గ్రామస్తులు





ఆస్పత్రిలో వైద్య సేవలందిస్తున్న పశు వైద్యాధికారి చైతన్యమణి

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి పశు వైద్యశాలకు సుమారు దశాబ్దంన్నర తర్వాత సొంత భవనం సమకూరింది. వైద్య సేవలు మెరుగుపడ్డాయి. పాడి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక పశు వైద్యశాల భవనం శిథిలావస్థకు చేరడంతో 15 ఏళ్ల క్రితం సొంత భవనం కోసం ప్రభుత్వం రూ.7 లక్షలు మంజూరు చేసింది. ఆ నిధులు సరిపడక భవనం అసంపూర్తిగా నిలిచిపోయింది. ఆ తర్వాత దాని గురించి పాలకులతోపాటు ప్రజలూ మర్చిపోయారు.

నిర్మాణానికి ముందుకు రాక

2014లో హుద్‌హుద్ తుపాను నిధులు వచ్చినప్పటికీ, అవి కూడా అరకొరే కావడంతో ఎవరూ నిర్మాణం పూర్తి చేసేందుకు ముందుకు రాలేదు. దీంతో ఆ నిధులు వెనక్కి మళ్లాయి. ఈ నేపథ్యంలో పాత భవనం శిథిలావస్థకు చేరి, కూలిపోయేలా తయారయింది. దీంతో తాత్కాలికంగా పశు వైద్య కేంద్రాన్ని అక్కడి సామాజిక భవనంలోకి తరలించారు.

సరైన సదుపాయాల్లేక, జాతీయ రహదారిని దాటడం ప్రమాదకరంగా పరిణమించి పశువులకు వైద్య సేవలు సరిగా అందని పరిస్థితి. ఈ వైద్యశాల పరిధిలో నరసింగబిల్లి, జెట్టపురెడ్డితుని, ఏఎస్‌పేట, గొబ్బూరు, చింతలపాలెం, నూతలగుంటపాలెం, ఏనుగుతుని, సోమవరం తదితర గ్రామాలున్నాయి. వాటి పరిధిలో ఎక్కువ పశువులు ఉండటంతో వాటికి సేవలందించేందుకు ఈ ఆస్పత్రిని ఏర్పాటు చేశారు.

2017లో పశువుల ఆస్పత్రిగా..

గతంలో గ్రామీణ పశు వైద్య కేంద్రం ఉండేది. వెటర్నరీ అసిస్టెంట్ సేవలందించేవారు. దానిని 2017లో పశువుల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. పశు వైద్యాధికారి, అసిస్టెంట్లను నియమించారు. అయినప్పటికీ సొంత భవనం లేక వైద్య సేవలు సరిగా అందని పరిస్థితి. పాడి రైతులు ఇబ్బందుల్ని తెలుసుకున్న రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రోత్సాహంతో రూ.8 లక్షలు పంచాయతీ నిధులను కేటాయించారు. అసంపూర్తిగా ఉన్న పశు వైద్య కేంద్ర భవనాన్ని ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే పూర్తిచేసి ప్రారంభించారు. ప్రస్తుతం ఈ భవనంలోనే పశువైద్య సేవలు అందిస్తున్నారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచారు. దీంతో పశువుల ఆస్పత్రికి వస్తున్న కేసుల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది.

గ్రీన్ క్లబ్ దశాబ్ది వేడుకలు రేపు

అనకాపల్లి: స్థానిక గాంధీనగరం లయన్స్ క్లబ్ ఆవరణలో ఈ నెల 18న అనకాపల్లి గ్రీన్ క్లబ్ దశాబ్ది వేడుకలు నిర్వహించనున్నట్లు క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పిచ్చుకల సంతతి పరిరక్షణలో భాగంగా ధాన్యపు కుంచెలు తయారీపై శిక్షణ ఉంటుందన్నారు. క్లబ్‌లో 75 వసంతాలు నిండిన పర్యావరణ హితులు, సమాజ చైతన్య వారధులకు వజ్రోత్సవ వేడుకల ఆత్మీయ సత్కారం, ఆటల పోటీలు, వివిధ రకాల పర్యావరణహిత స్టాల్స్ ప్రదర్శన వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

రేపు కె.జె.పురంలో వాసవీమాత జయంతి



మాడుగుల రూరల్: వాసవీమాత జయంతిని పురస్కరించుకుని శనివారం కె.జె.పురం జంక్షన్‌లో కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వాసవీమాతకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని వాసవీక్లబ్ అధ్యక్షుడు శ్రీనాథు శేఖర్ గురువారం తెలిపారు. మాజీ సర్పంచ్ పాలకుర్తి ఆదినారాయణ(మైనర్) కుటుంబ సభ్యులు సహకారంతో మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేస్తున్నామన్నారు. శ్రీనాథు మల్లన్న కుటుంబ సభ్యులు మజ్జిగ వితరణ చేస్తారన్నారు. వాసవీమాత కుటుంబ సభ్యులు హాజరు కావాలని కోరారు.

చల్లబడిన వాతావరణంతో ఆహ్లాదం



పాతరోడ్డు సమీపంలో కొండల నడుమ ఆహ్లాద వాతావరణం

కోటవురట్ల : వాతావరణంలో మార్పుతో మండల ప్రజలు ఉపశమణం పొందుతున్నారు. కొద్ది రోజులుగా భానుడు ప్రతాపం చూపించడంతో తీవ్ర వడగాల్పులతో ఉక్కిరిబిక్కిరయ్యారు. ఉదయం 9 గంటల నుంచే భానుడు ప్రతాపం చూపించడంతో జనాలు ఇళ్లకే పరిమితమయ్యేవారు. రెండు రోజులుగా వాతావరణంలో మార్పు చోటు చేసుకుని అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. పూర్తిగా వాతావరణం చల్లబడడంతో ప్రజలు చల్లగాలులతో సేదతీరుతున్నారు. ఎన్నికల సమయంలో ఎండలతో ఇబ్బంది పడిన ప్రజలు ప్రస్తుత వాతావరణాన్ని ఎంజాయ్ చేస్తున్నారు. చెరువుల్లోకి కొంచెం కొంచెంగా నీరు చేరుతోంది. కొండలపై వెండి మబ్బులు కనువిందు చేస్తున్నాయి.

మునగపాక : మండల వ్యాప్తంగా వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. దీంతో ప్రజలు ఉపశమనం పొందారు. కొద్ది రోజులుగా ఎండతీవ్రతతో సతమతమయ్యే ప్రజలకు వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా సేదతీరారు. బుధవారం అర్ధరాత్రి తరువాత నుంచి గురువారం కూడా చిరుజల్లులు కురవడంతో ప్రజలు ఉపశమనం పొందారు. అలాగే రైతులు కూడా మారిన వాతావరణంతో ఒకింత హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బాధితుడికి మెరుగైన వైద్యం అందించాలి



గాయపడిన కార్మికుడిని పరామర్శిస్తున్న రాము

రాంబిల్లి : సింబయో ఫార్మా కంపెనీలో గాయపడిన కార్మికుడు కాజల్ బౌరి కి మెరుగైన వైద్య సేవలందించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. బుధవారం రాత్రి ఈ కంపెనీలో రసాయనాలు పడి కార్మికుడు గాయపడడం జరిగిందన్నారు. సరైన భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంతోనే తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆయన అన్నారు. అధికారులు సక్రమంగా పరిశీలన చేయడం లేదని ఆరోపించారు. కాగా సింబయో పరిశ్రమలో జరిగిన ప్రమాదం సమాచారం గురువారం తెలిసిందని దీంతో సంఘటన స్థలాన్ని పరిశీలించినట్లు సీఐ లక్ష్మణరావు విలేకరులకు తెలిపారు. అలాగే గాయపడిన కార్మికుడు పశ్చిమ బెంగాల్‌కు చెందిన వాడని, ప్రస్తుతం అచ్యుతాపురంలో గల ఒక ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఘనంగా మరిడిమాంబ పండగ



అమ్మవారి దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

యలమంచిలి రూరల్ : మండలంలోని రేగుపాలెంలో గురువారం మరిడిమాంబ అమ్మవారి పండగ ఘనంగా జరిగింది. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు గురువారం ఉదయం నుంచి రాత్రి వరకూ బారులు తీరారు.పలువురు మహిళా భక్తులు అమ్మవారికి చీర, రవికె, గాజులు పెట్టి పసుపు కుంకుమలతో పూజలు చేశారు. పండగ సందర్భంగా హైవే కూడలి నుంచి అమ్మవారి ఆలయం వరకు విద్యుత్ దీపాలతో అలంకరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. వర్షం కురుస్తున్నప్పటికీ భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రాత్రి ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జాతర సందర్భంగా పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. గ్రామ సర్పంచ్ రాజాన మహాలక్ష్మి, రాజాన శ్రీనివాసరావు,న్యాయవాది రాజాన గోవిందరావు, రాజాన మహలక్ష్మీ శ్రీనివాస్,రాజాన కొండబాబు,రాజాన నానాజీ,రాజాన సురేష్,రాజాన కొండలరావు తదితరులు భక్తులకు ఇబ్బందులు లేకుండా పండగ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వర్షంతో ఉపశమనం



ఎన్టీఆర్ క్రీడామైదానం వద్ద వర్షంలో వాహనాలు



కశింకోటలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

- పట్టణ పరిధిలో 10.5 మి.మీ. వర్షపాతం నమోదు

అనకాపల్లి: వేసవి ఉష్ణోగ్రతలతో ఉక్కిరిబిక్కిరవుతున్న పట్టణ ప్రజలకు వర్షం కాస్త ఉపశమనాన్నిచ్చింది. వారం రోజులుగా పగటిపూట వేడి వాతావరణానికి జనాలు అల్లాడిపోతున్నారు. సాయంత్రానికి ఆకాశం మబ్బులు పట్టి, వాతావరణం చల్లబడటంతోపాటు అడపాదడపా కురిసే చినుకులకు ప్రజలు కాస్త సేదతీరుతున్నారు. గురువారం మాత్రం ఉదయం నుంచే ఆకాశం మేఘావృతమై చిరు జల్లులుగా మొదలైన వాన కాస్త ఎక్కువ సమయమే కురిసింది. పట్టణ పరిధిలో ఉదయం 8 గంటలకు మొదలైన వాన 10.30 గంటల వరకూ కొనసాగింది. దీంతో 10.5 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ వర్షం పట్ల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వేసవి దుక్కులకు వర్షం ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్తున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చే రైతులు, వివిధ ప్రభుత్వశాఖల ఉద్యోగులు, చిరువ్యాపారులు వారివారి కార్యకలాపాలకు వెళ్లే సమయంలో ఇబ్బంది పడ్డారు. మెట్ట ప్రాంత రైతులు మినుములు, పెసలు, చిరుధాన్యాల పంటలు వేసుకునేందుకు ఈ వర్షం ఎంతగానో ఉపయోగపడుతుందని వాతావరణ నిపుణులు చెప్తున్నారు.

కశింకోట:మండలంలో గురువారం వర్షం కురిసింది. వాతావరణం చల్లబడింది. వేసవి తాపంతో సతమతమవుతున్న ప్రజలు ఉపశమనం పొందారు. చిన్నపాటిగా మొదలై మూడు గంటలు పైగా కురిసింది. పల్లపు ప్రాంతాల్లో నీరు చేరింది. వర్షం చెరకు తోటలకు ఉపకరిస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జూన్ 17న వెంకన్న కల్యాణం

కశింకోట: స్థానిక వేంకటేశ్వరస్వామి ధ్యాన మందిరంలో జూన్ 17న జ్యేష్ట శుద్ధ ఏకాదశి పురస్కరించుకుని 7వ వార్షిక కల్యాణ మహోత్సవాలను రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మొదటి రోజు సాయంత్రం 6 గంటలకు శ్రీనివాసుని కల్యాణోత్సవం, రెండవ రోజు గరుడోత్సవం జరపనున్నట్లు పేర్కొన్నారు.